ప్రజాశక్తి

బుధవారం 12 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గుంటూరు కలెక్టరేట్ ముట్టడి



4,5లో

పల్నాడు కలెక్టరేట్ ముట్టడి



గుంటూరులో డిఆర్ఒకు వినతిపత్రం



దద్దరిల్లిన కలెక్టరేట్‌లు

- గుంటూరు, పల్నాడులో ముట్టడించిన అంగన్‌వాడీలు
- రెండోరోజూ రెట్టించిన ఉత్సాహంతో ధర్నా
- ఎమ్మెల్సీ లక్ష్మణరావు, వివిధ సంఘాలు పెద్ద ఎత్తున సంఘీభావం
- ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక ఆందోళన : సుబ్బరావమ్మ



నరసరావుపేటలో నాయకులతో మాట్లాడుతున్న జెసి

నాలుగేళ్లుగా అదిగో..ఇదిగో..!

కదలిక లేని యుజిడి పనులు - కార్యరూపం దాల్చని ఏడాది కిందటి సిఎం హామీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.903.82 కోట్ల అంచనాలతో 2017 జనవరి 30న భూగర్భ డ్రెయినేజి పనులు ప్రారంభించారు. 2019 మే నెల వరకూ దాదాపు 55 శాతం పనులు జరిగాయి. టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరులో తీవ్ర జాప్యం వల్ల నత్తనడక పనులు జరిగాయనే విమర్శ ఉంది. 2019 మేలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను సమీక్షించాలని నిర్ణయించారు. దీంతో పనులు నిలిపివేశారు. ఆ తరువాత వైసిపి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను కాంట్రాక్టరుకు చెల్లించింది. తిరిగి పనులు చేపడతామని చెప్పిన కాంట్రాక్టు సంస్థ 2020 నవంబరులో తిరిగి పనులు ప్రారంభించేందుకు అంగీకరించారు. ఈ మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గం మంగళదాస్ నగర్, పరమాయకుంట, ఆర్‌టిసి కాలనీలో పనులు ప్రారంభించారు. వారంపాటు పనులు చేసి మళ్లీ పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. దాదాపు రెండున్నరేళ్లుగా పనులు ఆగిపోయినా మళ్లీ ఈ సంస్థను సంప్రదించిన వారేలేరు.



యుజిడి పనుల కోసం తవ్విన గుంతలు (ఫైల్)

గుంటూరులో నాలుగేళ్ల క్రితం నిలిచిన భూగర్భ డ్రెయినేజి పనులు ఎప్పటికి పున: ప్రారంభం అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పనులు పూర్తి చేస్తామని సిఎం హామీ ఇచ్చి ఏడాదైనా పనుల్లో కదలిక లేదు. భూగర్భ డ్రెయినేజి పనులకు రూ.230 కోట్లు కేటాయిస్తున్నట్లు సిఎం జగన్ చేసిన ప్రకటన కార్యరూపం దాల్చలేదు.

10 విలీన గ్రామాల ప్రజలను కలిపి మొత్తం 10 లక్షల జనాభాకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. లక్షా 45 వేల ఇళ్లకు డ్రెయినేజి కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. మొత్తం 1083.72 కిలో మీటర్ల పైపు లైన్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకూ 505.05 కిలో మీటర్ల మేరకు పైపు లైను నిర్మించారు. 43,574 మ్యాన్ హోల్స్ నిర్మించాల్సి ఉండగా 20,376 నిర్మించారు. 27,044 ఇన్‌స్పెక్షన్ చాంబర్స్ నిర్మించాల్సి ఉండగా 12 వేల వరకూ నిర్మించారు. మొత్తంగా ▶ 2లో

ఏసీబీ వలలో సూపరింటెండెంట్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మంగళగిరి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ సయ్యద్ లయిక్ అహ్మద్ రూ.16 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. గుంటూరు జిల్లా అరుంధతి నగర్ చెందిన పి.నరేంద్రబాబు భార్య ఎఎన్‌ఎంగా పని చేస్తున్నారు. ఆమెకు అంతర్ జిల్లాల పరస్పర బదిలీ దరఖాస్తును ప్రాసెస్ చేయడానికి అహ్మద్ రూ.40 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో ఏసీబీ అధికారుల సూచనల మేరకు ఎఎన్‌ఎం భర్త నరేంద్ర మంగళశారం రూ.16 వేలను అహ్మద్‌కు ఇస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరు పర్చనున్నట్టు డిజిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ శివశంకర్

రైల్వేస్టేషన్ల అభివృద్ధి, రైల్వే లైన్ల నిర్మాణం, అంతర్గత వంతెనల నిర్మాణం, రైల్వే గూడ్స్ షెడ్ల అభివృద్ధి తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సమగ్రాభివృద్ధిపై డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశంలో మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కంపెనీలు, డీలర్లు బ్లాక్ మార్కెట్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల వద్ద ముందుగానే డబ్బులు తీసుకుని విత్తనాలు, పురుగు మందులను సకాలంలో ఇవ్వని వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రైతులను ఇబ్బంది ▶ 2లో

14న అభ్యుదయ కాలేజీలో ఐసిఐసిఐ జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కాలేజిలో ఐసిఐసిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈనెల 14న ఉదయం 10 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజి ప్రిన్సిపాల్ బి.రోహిణీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిఐసిఐ పర్మినెంట్ ఆన్‌రోల్ ఉద్యోగం, రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగానికి 25ఏళ్ల లోపు వయస్సు కలిగి, 10వ తరగతి నుండి డిగ్రీ వరకూ 50శాతం మార్కులతో ఉత్తీర్ణులు అయిన వారు అర్హులని తెలిపారు. డిగ్రీ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులన్నారు. వార్షిక వేతనం రూ.2.60లక్షల నుండి రూ.3 లక్షల వరకూ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా, అర్హతల ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండో పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ బి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ సూచించారు. ఇతర వివరాలకు 9182020936 నంబర్‌లో సంప్రదించాలన్నారు.





క్రీడాకారులతో ముఖాముఖి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని క్రీడాకారులతో ప్రముఖ క్రికెటర్ అబంటి తిరుపతిరాయుడు ముఖాముఖి నిర్వహించారు. పట్టణంలోని సీతానగరంలోని కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతానగరంతో పాటు పాత శివాలయం వద్ద శుభమస్తు కళ్యాణ మండపంలో పట్టణంలోని క్రీడకారులతో మాట్లాడారు. క్రికెట్‌తో పాటు అన్ని రకాల క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్రీడాకారులకు తన వంతు సాయం అందజేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాల సోమిరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ డేవిడ్‌రాజు, ఎ.తిరుపతిరావు, ఎం.వెంకటేశ్వరరావు, దుర్గారావు, ఎం.వెంకటరామిరెడ్డి, ఎం.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడు చేతిలో అన్న హతం

ఇన్నర్ రింగ్ రోడ్డులో హత్య

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

కుటుంబ కలహాల నేపథ్యంలో అన్నను హత్య చేసిన తమ్ముడు ఉదంతం తెలిసింది. నల్లపాడుపోలీసుల కథనం ప్రకారం భాష్యం టైటానిక్ క్యాంపస్ సమీపంలో ఈ ఘటన జరిగింది. గుంటూరు నల్లచెరువులో నివాసంఉంటున్న షేక్ సైఫ్ ఆలీఖాన్ ,షేక్ షాజహాన్ ల మధ్య కొంతకాలంగా వివాదాలు ఉన్నాయి. ఇన్నర్ రింగ్ రోడ్డులో పని ఉందని అన్నను నమ్మకంగా తీసుకువెళ్లిన తమ్ముడు ఆలీఖాన్ కత్తితో అన్న షాజహాన్‌ను హత్య చేశాడు. నల్లపాడు సిఐబత్తుల శ్రీనివాసరావు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

మంచికల్లు రిజర్వాయర్లో బయల్పడ్డ మల్లేశ్వర స్వామి ఆలయం

ప్రజాశక్తి - రెంటచింతల



పల్నాట కోనసీమగా పేరుగాంచిన మంచికల్లు బుగ్గ రిజర్వాయర్లో పురాతన ఆలయ బయల్పడింది. అదే బుగ్గ మల్లేశ్వర ఆలయంగా ఈ ప్రాంతంలో పేరు గాంచింది. ఎంతో చారిత్రక ప్రాధాన్యత గల ఈ ఆలయంలో పార్వతీ అమ్మవారు శివలింగం ఉన్నాయి. దాదాపు 3300 వందల ఎకరాల్లో విస్తరించిన రిజర్వాయర్లో నీళ్లు తగ్గిన ప్రతిసారి ఆలయం బయట పడుతుంది. 1967లో ఈ రిజర్వాయర్‌ను నిర్మించారు.

నాలుగేళ్లుగా అదిగో..ఇదిగో..!

(మొదటిపేజీ తరువాయి)

రూ.540 కోట్ల మేరకు పనులు జరిగాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో భూగర్భ డ్రెయినేజి పనులు పూర్తయినా ఇంత వరకూ ఇంటింటికి కనెక్షన్లు ఇవ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ వత్తిడి వల్ల పనులు వేగంగా జరగలేదనే విమర్శలు రాగా మూడేళ్లలో జరగాల్సిన పనులు ఎనిమిదేళ్లయినా పూర్తి కాలేదు. ఈ పనులు కూడా కొన్ని ప్రాంతాల్లో అస్తవ్యస్థంగా జరిగాయి. పైపులైను నిర్మాణం కోసం ఇష్టానుసారంగా తవ్వేశారు. యూజిడి పనులపై కార్పొరేషన్ అధికారులు, పబ్లిక్ హెల్త్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కార్పొరేషన్‌లో పలువురు సభ్యులు డిమాండ్ చేసినా గత రెండేళ్లలో మేయర్ ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. 2017-19మధ్య జరిగిన యుజిడి పనులతో నగరంలో రహదారులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. గోతులు, గుంటలతో దెబ్బతిన్న రహదారుల పనురుద్ధరణలో తీవ్రజాప్యం జరిగి ఐదేళ్లుగా నగర వాసులు నరకయాతన పడుతున్నారు. గత రెండేళ్లలో నగరపాలక సంస్థ అధికారులు కొన్ని రహదారులు నిర్మించినా ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి.

పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధిపై సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

పెట్టే కంపెనీలు, డీలర్ల లైసెన్సులు రద్దు చేయిస్తామని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి తప్పని సరిగా రైతు భరోసా కేంద్రాల ద్వారా డీలర్లు వ్యవసాయానికి సంబంధించిన ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయిమార్కొండారెడ్డి, జెజి శ్యామ్ ప్రసాద్ మాట్లాడారు. జిల్లా రైల్వే శాఖాధికారి అనూష, జిల్లా రహదారులు అభివృద్ధి శాఖాధికారి పార్వతీశం, ఇతర అధికారులు, కంపెనీల ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధికి తమవంత సహకరిస్తామని చెప్పారు.



లోకేష్ పాదయాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నారా లోకేష్ పాదయాత్రపై విమర్శలు చేసిన వైసిపి నాయకులకు ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండా పోయిందని టిడిపి తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జి మహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. యువగళం పాదయాత్ర రోజురోజుకీ అపూర్వ ఆదరణ లభిస్తుందని ఆయన తెలిపారు. ఇప్పటికే 2వేల కిలో మీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు ఒన్ టవున్‌లో మంగళవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి లోకేష్ పాదయాత్ర ఎంతో బాసటగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు చిట్టాబతిన చిట్టిబాబు, మాద్దిరాల మ్యాని, యల్లావుల అశోక్,ముప్పవరపు భారతి,పోతురాజు సమత, సోపాటి రత్నం , జమీర్, మహంకాళి నరసింహారావు, గోళ్ళ ప్రభాకర్, వెల్చురి కిరణ్,హఫీజ్, కొల్లా శ్రీను, విజయలక్ష్మి,,గుడిపల్లి వాణి,యర్రగొపు నాగేశ్వరావు పాల్గొన్నారు.



నాదెండ్లలో

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :యువగళం పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న నరసరావుపేట నియోజకవర్గ టిడిపి బాధ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో మంగళవారం సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నరసరావుపేట నియోజకవర్గంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము) ఆధ్వర్యంలో యువగళంకు సంఘీభావంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రొంపిచర్ల మండలం గోగులపాడు గ్రామం నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ కొనకంచివారిపాలెం, రొంపిచర్ల, అన్నవరం, తుంగపాడు, ఇక్కుర్తి, అల్లూరివారిపాలెం, లింగంగుంట్ల మీదుగా నరసరావుపేట పట్టణం గుండా నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామం వరకు నిర్వహించారు. మార్గంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నుండి ఐలాండ్ సెంటర్ వరకు తెలుగుదేశం కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్ : యువగళం పాదయాత్ర కు సంఘీభావం పాదయాత్ర సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి ఆంజనేయస్వామి గుడి దగ్గర నుంచి ప్రధాన వీధుల్లో... గాంధీ చౌక్ వరకు.టిడీపి నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, మన్నెం శివనాగమల్లేశరరావు పాల్గొన్నారు

ప్రజాశక్తి - నాదెండ్ల : తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర సరికొత్త చరిత్ర సష్టిస్తుందని, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని మాజీమంత్రి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీమంత్రి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట : స్థానిక కృష్ణ మహల్ సెంటర్ లోగల కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి లోకేష్‌కు భాష్యం ప్రవీణ్ శుభాకాంక్షలు తెలిపారని సాంబశివ రావు అన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : యువగళం పాదయాత్ర అన్ని వర్గాల ప్రజలను అకట్టుకుంటుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం సందర్భంగా మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తల నడుమ కేక్ కత్తిరించారు.

హ్యాట్సాఫ్ నారాలోకేష్ : మన్నవ మోహన కృష్ణ



ప్రజాశక్తి-గుంటూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2వేల కిలోమీటర్ల మైలురాయి చేరుకోవటం అభినందనీయమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, గుంటూరు పశ్చిమ నియోజక వర్గ నాయకులు మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు. ఐదు కోట్ల మంది ప్రజల ఆశీస్సులతో యాత్ర విజయవంతంగా సాగుతుందన్నారు. 400 రోజుల్లో 4వేల కిలోమీటర్లు చేరుకోవాలని పాదయాత్ర ప్రారంభించిన యువనేత, 153 రోజుల్లోనే సగం లక్ష్యాన్ని అధిగమించటం లోకేష్ పట్టుదలకు నిదర్శమన్నారు. ప్రభుత్వ ఎన్ని ఆటంకాలు సృష్టించానా ధీటుగా ఎదుర్కొంటూ అలుపెరగకుండా యాత్ర కొనసాగిస్తున్న లోకేష్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తాడేపల్లి పట్టణంలోని మహానాడు 21వ వార్డు నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, నాయకులు టి.జానకీదేవి, శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, సుబ్బారావు, చిన్నపోతుల సుబ్బారావు పాల్గొన్నారు.

సిఎం దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పవన్ కల్యాణ్‌పై వైసిపినాయకులు అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ జనసేన ఆధ్వర్యంలో స్థానిక శంకర్ విలాస్‌నుంచి లాడ్జి సెంటర్ వరకు మంగళవారం నల్లబెలూన్లతో నిరసన ప్రదర్శన జరిగింది. అనంతరం లాడ్జి సెంటర్‌లో జనసేన కార్యకర్తలు సిఎం జగన్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జనసేన కార్యకర్తలకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దిష్టిబొమ్మను తగుల బెట్టకుండా పోలీసులు ప్రయత్నించగా జనసేన కార్యకర్తలు వ్యూహాత్మకంగా పార్టీ కార్యాలయం భవనం నుంచి కిందకు వేసి వెంటనే దగ్ధం చేశారు. అంతకు ముందు జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ వాలంటరీ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపారని వీటిని సరిచేయాల్సిన ప్రభుత్వం ఎదురుదాడి చేస్తుందన్నారు.

బాలిక కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నగర పాలక సంస్థ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో స్థానిక వెలంగణి నగర్ లో పాము కాటుతో మతి చెందిన బాలిక మతదేహనికి పశ్చిమ నియోజకవర్గం టిడిపి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) నివాళులర్పించారు. బాలిక తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. వారి కుటుంబానికి ఆర్థికసహాయం అందించారు. క్రిస్టియన్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, టిడిపి నాయకులు కనపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

4న పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి తెనాలి :స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి యూనిట్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 4న జరుగుతుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. అసోసియేషన్ కార్యాలయంలోని దేవ భక్తుని బాపేశ్వరరావు మెమోరియల్ హాలులో అధ్యక్షులు మాచిరాజు రామకృష్ణమూర్తి అధ్యక్షతన సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం జరుగు తుందన్నారు. భోజన శాల నిర్మాణ ఖర్చుల ఆమోదం, 2022 సంవత్సరానికి సంబంధించిన జమా ఖర్చులు తదితర అజెండా అంశాలతో సమావేశం జరుగుతుందన్నారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి- తెనాలి

యువకుడిపై రౌడీషీటర్ దాడి చేసిన ఘటనపై పట్టణ త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన వరికుంట్ల ఏసుబాబు సోమవారం సాయంత్రం సంజీవిని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఉండగా, రౌడీ షీటర్ తలవరస విజయ బాబు మద్యం బాటిల్ తో దాడి చేశాడు. గతంలో యేసు బాబు కు విజయబాబు మిత్రుడే. కొంతకాలంగా వీరిరువురి మధ్య మాటల్లేవు. దానిని దృష్టిలో పెట్టుకున్న విజయబాబు ఏసుబాబు పై హత్యాయత్నం చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే వరికపూడిసెల శంకుస్థాపన : జూలకంటి

ప్రజాశక్తి - విజయపురిసౌత్



ప్రజలను మభ్య పెట్టేందుకే వరికపూడిసెల ప్రాజెక్టు శంకుస్థాపన అంటూ వైఎస్ఆర్సిపి నాయకులు హడావిడి చేస్తున్నారని మాచర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బ్రహ్మానంద రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ వరికపూడిసెల ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసిన వారికి రూ. 18 లక్షల డబ్బులు ఇప్పటివరకు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రాజెక్టు రిపోర్టు తయారుచేసిన వారికే డబ్బులు ఇవ్వని ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని ప్రత్యేక రాజ్యాంగం మాచర్ల నియోజకవర్గంలో నడుస్తుందని అన్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ వారి భూకబ్జాలు ఎక్కువయ్యాయని చివరికి దేవుడు మాన్యాలను కూడా వదలడం లేదని ఆరోపించారు. ప్రజలకు ఏవైనా పనులు కావాలంటే అధికార పార్టీ వారు తమ పార్టీ కండువాలు కప్పుకోవాలంటూ వారిపై ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న అధికారులు భవిష్యత్తులో ఇబ్బందులు పడక తప్పదని అన్నారు. మీడియా సమావేశంలో మాచర్ల పట్టణ అధ్యక్షుడు కొమెరా దుర్గారావు, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాతులూరి కుమార్, నేరేటి వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
బుధవారం 12 జులై 2023

వ్యక్తి అదశ్యంపై కేసు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన సింహాద్రి రవి బంగారం పని చేస్తాడని సోమవారం నుండి అదృశ్యం అయ్యాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. మంగళవారం సింహాద్రి రవి భార్య సింహాద్రి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగళరిగి రూరల్ పోలీసులు తెలిపారు.

వాహనాల చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలంలో బైకుల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్, బి జగన్మోహన్రావు మంగళవారం తెలిపారు. నిందితుల వద్ద నుండి ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తాడేపల్లి అమరారెడ్డి నగర్ కు చెందిన దూదేకుల హబీబుల్లా ఈనెల 8వ తేదీన చిన్న కాకాని వద్ద హోటల్లో తినేందుకు వెళ్లి బయటికి వచ్చేసరికి అక్కడే పార్కు చేసిన వాహనం చోరీకి గురి కావడంతో మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు



ప్రారంభించారు. ఈ క్రమంలో పాతనేరస్తులే చోరీ చేసినట్లు గుర్తించి గ్రామానికి చెందిన మేరిగ ప్రవీణ్, జాలాది దిలీప్ కుమార్, బుస్సా అనిల్కుమార్లను అరెస్టు చేశారు. వారు ఆత్మకూరు గ్రామ పరిసర నిర్మానుష్య ప్రాంతాల్లో దాచి ఉంచిన వాహనాలకు స్వాధీనం చేసుకున్నారు.

మినీ ఆటో ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



మినీ టాటా ఏసీ ట్రాలీ ఆటో ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కోనంకి చోటుచేసుకుంది. ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన చిన్నినాయక్, శ్రావణిబాయి 13 నెలల కుమారుడు ఇంటి ముందు ఉన్న మట్టి కుప్ప వద్ద ఆడుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన మినీ టాటా ఏసీ ట్రాలీ ఆటో గ్రామంలో వడ్ల బస్తాలను మిల్లులకు వద్దకు, వాటర్ క్యాన్లను సరఫరా చేస్తూ నందిపాటి శ్రీనివాస్ రెడ్డి జీవనం సాగిస్తున్నాడు. ఎదురుగా బైక్ ఉండటం మట్టి కుప్ప వద్ద బాలుడు ఆడుతున్న సంగతి గమనించకుండా బాలుడు పైనుంచి ఆటో పోనివ్వడంతో బాలుడు అక్కడక్కడ మృతి చెందాడు. చిన్ననాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

విద్యుద్ఘాతంతో రూ.3 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

విద్యుద్ షార్ట్ సర్క్యూట్తో కూలి పనులు చేసుకునే మొగిలిపాలెం హరిబాబు ఇంటిలోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. మంగళవారం మద్యాహ్నం చోటు చేసుకున్న సంఘటనలో రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. తన రెండవ కుమార్తె వివాహం కోసం బీరువాలో దాచుకున్న రూ.50వేలు నగదు, వెండి వస్తువులు కూడా కాలిపోయిందని తెలిపాడు. కట్టు బట్టలతో మిగిలామన్నారు. రోజులాగా మంగళవారం ఉదయాన్నే భార్యాభర్తలు ఇరువురు ఇంటికి తాళం వేసి కూలి పనికి వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఈ సంఘటన జరగడానికి చుట్టుప్రక్కల వారు చూసి ఫోన్ ద్వారా హరిబాబు వాళ్లకు తెలియజేయగా వారు పని నుండి వచ్చేసరికి మొత్తం కాలిపోయాయి. సంఘటనా స్థలాన్ని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ సందర్శించి బాధితులను పరామర్శించి రూ.పదివేల ఆర్థిక సాయం చేశారు. బేతపూడి సొసైటీ ప్రెసిడెంట్ షేక్ జాకీర్ రూ.10వేలు, స్థానిక తహసీల్దార్ డి పద్మనాభుడు రెండు క్వింటాళ్ల బియ్యం బాధితులకు అందజేశారు. ప్రభుత్వం నుండి సహాయాన్ని ఇవ్వడానికి ప్రయత్నిస్తామని వీరు తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

ప్రజాశక్తి - నకరికల్లు

విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కృష్ణ తెలిపారు. మండలంలోని నకరికల్లు, శాంతినగర్, కుంకులకుంట, కండ్లకుంట, చల్లగుండ్ల, చేజర్ల , నరసింగపాడు గుండ్లపల్లి, గ్రామాలలో విజిలెన్స్ విద్యుత్ అధికారులు విస్తృత తనిఖీలు మంగళవారం నిర్వహించారు. 2478 సర్వీసులను పరిశీలించి 135మందికి రూ. 4.88 లక్షల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. తనిఖీలలో 49 అధికారులు,147 మంది సిబ్బంది 49 బృందాలుగా పాల్గొన్నారని ఈఈ తెలిపారు.

కాల్వలో పడిన బాలిక మృతి

ప్రజాశక్తి - దుగ్గిరాల :ప్రమాదవశాత్తు మూడు సంవత్సరాల బాలిక కాలువలో పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం దుగ్గిరాలలోని ముర్తుజానగర్లో చోటు చేసుకుంది. కొమ్మమూరు కాలువ వద్ద నివాసముండే కూలి పనిచేసుకునే పల్లి శ్రీకాంత్ తన ఇద్దరు కుమార్తెలను, భార్యను సమీపంలోఉన్న అత్తవారి ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం అడుకుంటూ బాలిక జస్మిక కాలువలో పడి మునిగిపోయింది. కొంత సమయం తరువాత జాస్మికను వెతుక్కుంటూ వెళ్లిన కుటుంబ సభ్యులకు జస్మిక కాలువలోని గుంటలో కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

జాస్మిన్ కేసు సిబిసిఐడికి అప్పగించాలి

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ :పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడంతోనే జాస్మిన్ సుల్తానా కేసు ఏడేళ్లు అవుతున్నా నేటికీ రిజిస్టర్ చేయలేదని, ఈ కేసును సిబిసిఐడికి అప్పటించాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పొన్నూరులో ముస్లిం నాయకులు, పెద్దలుతో సుల్తానా మృతికి న్యాయం జరగాలని సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ నాజర్, మరికొందరు మాట్లాడారు. 2016లో నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామంలో మైనార్టీ యువతి జాస్మిన్ సుల్తానాను అత్యాచారం చేసి దానిని ఆత్మహత్యగా నిందితులను అప్పటి సిఐ పెంచలరెడ్డి అక్కడి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ వత్తిడితో దోషుల్ని నిర్దోషులుగా చిత్రీకరించారన్నారు. జాస్మిన్ కేసు నేటికి నమోదు చేయకుండా కాలయాపన చేయడంతో ఆమె కుటుంబ సభ్యులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైన జాస్మిన్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	45,625
మిర్చి ఎగుమతి	:	44,034
మిర్చి నిల్వ	:	15,825

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,500
నెం.5	10,000 - 22,500
273	16,500 - 21,000
341	11,500 - 22,500
4884	12,500 - 20,000
సూపర్ 10	17,000 - 23,100
నాన్ ఎసి స్పెషల్ వెరైటీ	
తేజ	9,000 - 24,500
బడిగి	11,500 - 25,500
దేవనూరు డీలక్స్	13,500 - 22,000
తాలుకాయలు	5,000 - 14,000
ఎసి కామన్ వెరైటీ	
334	12,500 - 22,000
నెం.5	13,500 - 13,500
341	15,500 - 22,000
4554	19,000 - 19,000
ఎసి స్పెషల్ వెరైటీ	
తేజ	10,000 - 24,300
బడిగి	16,000 - 26,000
దేవనూరు డీలక్స్	16,000 - 21,300
తాలుకాయలు	6,000 -13,500

మహారాజశ్రీ గౌరవనీయులైన 13వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో, నరసరావుపేట
IA NO. 442/23, IA NO. 443/23, IA NO. 444/23, IA NO. 457/23, IA NO.609/23
ఇన్ ఫైనల్ డిక్రీ పిటీషన్ నెం. 298/2020 IN OS NO 13/2009

Between
కొప్పురావూరి రత్నకుమారి.... Petitioner/ Plaintiff
And
రాచమల్లు వరదరాజులు గుప్తా మరియు ఇతరులు
....Respondents/ Defendant

To,
R4. గార్లపాటి దామిత్రావు S/o రాధాక్రిష్ణమూర్తి
R5. ఇంటూరి నాగరాజు S/o నరసింహారావు
R6. మునగపాటి కోటేశ్వరరావు S/o నరసింహారావు
R8. కొక్కిరాల బసవయ్య S/o చంద్రయ్య
R9. పి. మల్లారావు S/o బికాజి
R10. మురుకుట్ల సీతారామస్వామి S/o సత్యనారాయణ
R11. గుగిలం రమేష్ బాబు S/o శేషగిరిరావు
R13. తనుబొడ్డి హరిబాబు రెడ్డి S/o లక్ష్మారెడ్డి
R14. పొత్తూరి. నాగేశ్వరరావు S/o ఆదిశేషయ్య
R15. షేక్ భాషా S/o మహ్మద్ అలీ
R16. అబ్దుల్ సత్తార్ S/o సులేమాన్
R17. రామిశెట్టి సాంబయ్య S/o వెంకటేశ్వర్లు
R19. షేక్ లూమాంబ S/o మౌలాలి
R21. పొత్తూరి శ్రీనివాసరావు S/o స్వామి
R23. చిలకల హనుమంతరావు S/o రోశయ్య
పైన పేర్కొన్న R4 నుంచి R23 వరకు చిలకలూరిపేట పట్టణం లో నివసిస్తున్నారు.
R27. నీలికత్తి గోవిందమ్మ D/o గాదంశెట్టి సత్యనారాయణ W/o వెంకటసుబ్బారావు (లేటు)
R29. బవిరిశెట్టి పార్వతి W/o ధనుంజయరావు D/o గాదంశెట్టి సత్యనారాయణ
R30. గాదంశెట్టి పద్మావతి D/o సత్యనారాయణ
R31. చేపూరి రేణుకదేవి W/o సురేష్బాబు D/o గాదంశెట్టి సత్యనారాయణ
R27, R29 to R31 వరుకు చౌత్రాసెంటర్ R/O: D No. 22-194 చిలకలూరిపేట పట్టణం
R32. షేక్ షలీమా @ సునీత W/O not known, D/o గాదంశెట్టి సత్యనారాయణ పసుమర్తి గ్రామం, చిలకలూరిపేట మండలం
R33. కె. వెంకటరమణ W/o కాకర్ల వెంకటేశ్వర్లు (లేటు)
R34. కె. క్రిష్ణబాబు S/o కాకర్ల వెంకటేశ్వర్లు (లేటు)
R33, R34 R/O: D No. 8-230, నాగేశ్వరరావు ఎలక్ట్రానిక్స్ వెనుక వైపు, చిలుకలూరిపేట పట్టణం
R35. ఎం.బాలరాజు S/o మద్ది రామారావు (లేటు)
R37. ఎం.రాణినిర్మల D/o మద్ది రామారావు (లేటు)
R 35, R37 R/O: D No. 7-439, శాంభవి మొబైల్స్, నాగేశ్వరరావు ఎలక్ట్రానిక్స్ ఎదురు, చౌత్రాసెంటర్, చిలకలూరిపేట
R36. ఎం. సుదర్శన్ S/o మద్ది రామారావు (లేటు) R/o : విజయలక్ష్మి ఎలక్ట్రానిక్స్ ప్రక్కన ఇల్లు, చౌత్రాసెంటర్, చిలకలూరిపేట
R38. డి.ప్రభాకర్ S/o దివ్వెల నాగేశ్వరరావు (లేటు)
R39. డి.ప్రసాద్ S/o దివ్వెల నాగేశ్వరరావు (లేటు)
R38, R39 R/o D.No :7-70 గబ్బిటి వారి వీధి, చిలకలూరిపేట
R40. ఎ.సుబ్బులు W/o అడుసుమల్లి చిన్న మల్లేశ్వరరావు (లేటు) R/O D.No: ఓల్డ్ డి.నం. 5-70, వీధినెం. 300 మున్సిపల్ కార్యాలయం ఎదురు చిలకలూరి పేట
R41. ఎ కిరణ్ S/o అడుసుమల్లి చిన్న మల్లేశ్వరరావు (లేటు) C/O. లక్కీ న్యూ లుక్ హెయిర్ సెలూన్ & జెంట్స్ బ్యూటీ పార్లర్ నరసరావుపేట సెంటర్, చిలకలూరిపేట

పై నెంబర్ ఫైనల్ డిక్రీ పిటిషన్, 026 R9 CPC పిటిషన్, 026 R13 CPC పిటిషన్, 040 R1 CPC పిటిషన్, 039 R1&R2 CPC పిటిషన్ మరియు SEC 152 CPC పిటిషన్ లో దాఖలు చేయగా సదరు పిటిషన్పై ఎవరికైనా అభ్యంతరములు ఉంటే తెలుపుకొవలసినదిగా కోరుతూ శ్రీ కోర్టు వారు నోటిసు నిమిత్తం ది:24-07-23 కి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆ రోజున ఉదయం 10.30 ని॥ పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యడల మీ పరోక్ష మందు తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వల మేరకు
వాయిదా 24-07-2023.
ఇట్లు ,
శ్రీగిరిరాజు నాగేశ్వరరావు,
కె.శ్రీరామ్,
పిటిషనర్ తరపు న్యాయవాదులు,
నరసరావుపేట.

మహారాజశ్రీ తెనాలి ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 314/2017

బిట్వీన్:
Movva Srinivasa Rao ....వాది
ఎదిరి
Allam Lakshmi and others ... ప్రతివాదులు
To,
D6 : Gampala Vijaya Santhi, W/o Babu, C/o G.Sambrajyam, Jaggadigunta Palem Village, Tenali Mandal, Guntur District.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టుద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు పంపించినను మీరు తీసుకొనకకాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 21-7-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా : 21-7-2023
షేక్ కరిమూన్
వాది తరపు అడ్వకేట్,
తెనాలి.
సెల్ : 8309605917

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 31/2023

బిట్వీన్:
యిరుకులపాటి నాగజితేంద్ర .... వాది
ఎదిరి
యిరుకులపాటి సాంబశివరావు వగైరాలు..ప్రతివాదులు
టు
డి-3 : యిరుకులపాటి అప్పారావు, తండ్రి : తిరుమలయ్య, ఉప్పలపాడు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరుజిల్లా.

పై నెంరు దావాలో డి-3 అయిన మీకు పై కోర్టువారి నుండి నోటీసులు/ సమన్లు పంపించినను మీకు ముట్టనందున మీ నోటీసును ఈ ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టువారు ది. 17-7-2023కి వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ తరపు అడ్వకేటుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది: 17-7-2023
కె.దేవరాజన్,
వాది తరపు అడ్వకేట్,
గుంటూరు.

మహారాజశ్రీ తెనాలి ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 244/2022

బిట్వీన్:
పొగడదండ వంశీకృష్ణ ...వాది
ఎదిరి
పెద్ది రామప్రసాద్ వురఫ్ బ్రంహ్మయ్య .... ప్రతివాదులు
To,
పెద్ది రామప్రసాద్ వురఫ్ బ్రంహ్మయ్య, తండ్రి : లేటు చెంచయ్య, డోర్నెం. 16-16-341, 1వ లైను, చినరాములవారి గుడి దగ్గర, ఆలినగర్, గుంటూరు టౌన్.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టుద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు పంపించినను మీరు తీసుకొనకకాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 25-7-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా : 25-7-2023
బొల్లిముంత విజయ్కుమార్,
వాది తరపు అడ్వకేట్, తెనాలి.
సెల్ : 94408 53217

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్జడ్జి గారి కోర్టులో
ఓ.యస్. నెం. 82/2022

వాది... చేబ్రోలు ఆనంద్ వురఫ్ ఆనంద్ సురేష్బాబు
అండ్
ప్రతివాది ... గార్లపాటి వెంకట నరేంద్రబాబు, తండ్రి : పెద లక్ష్మయ్య, డోర్ నెం. ప్లాట్ నెం.308, లలిత్హోమ్స్, సుభాని నగర్, చిలకలూరిపేట, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపైన దావా దాఖలు చేసి సదరు దావాలో శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఎన్నిసార్లు దావా నోటీసులు పంపినను మీరు యీ దావా విషయం తెలిసికూడా సదరు దావా నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కనుక శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం యీ పేపరు నోటీసు ద్వారా పై కోర్టువారి ఎదుట ది. 14-7-2023వ తేదీ ఉదయం 10-30 గ.లకు మీరుగాని, మీ తరఫు ప్లీడరుగారి ద్వారా గాని హాజరయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

శ్రీ త్రిపుర రామకృష్ణ,
వాది తరపు అడ్వకేటు,
చిలకలూరిపేట

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయము, ఈమని (ప్ర.కా) దుగ్గిరాల

ఆర్.సి. నెం. 23/2023 **తేది: 11-7-2023**

టెండరు నోటీసు

వ్యవసాయ మార్కెట్ కమిటీ, దుగ్గిరాల పరిధిలోని మార్కెట్యార్డు, దుగ్గిరాల నందు, పసుపు అమ్ముకొను రైతులకు, మధ్యాహ్నం పూట "ఉచిత భోజన పథకం" ద్వారా భోజనమును 24-7-2023 నుండి 31-3-2024 కాలమునకు సరఫరా చేయుటకు గాను, అర్హత, ఆసక్తి మరియు అనుభవం కలిగిన టెండరుదారుల నుండి సీల్డు టెండర్లను ఆహ్వానించుచున్నాము. టెండరు షెడ్యూల్ ఫారం ఖరీదు రూ.300/- టెండరు షెడ్యూల్లను ది.12-7-2023 నుండి 20-7-2023న మధ్యాహ్నం 12.00 గం.ల వరకు కార్యాలయంలో అమ్మబడును. ది.20-7-2023న ఉదయం 10-30 గం.ల నుండి మధ్యాహ్నం 2.00 గం.ల వరకు సీల్డు టెండరు షెడ్యూలను స్వీకరించబడును. మరియు అదేరోజు సాయంత్రం 3.30 గం.లకు సీల్డు టెండర్లు తెరువబడును.

ప్రభుత్వ సెలవు రోజుల యందు షెడ్యూలు ఫారములను అమ్మబడవు మరియు స్వీకరించబడవు.

ఏ కారణము తెలుపకుండానే టెండరును నిలుపుదల చేయుటకుగాని, వాయిదా వేయుటకుగాని లేదా రద్దు చేయుటకుగాని కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు.

ఇతర వివరముల కొరకు కార్యాలయపు పనివేళల యందు సంప్రదించగలరు.

ఫోన్ : 7331171723
స్థలం : దుగ్గిరాల
తేది : 11-7-2023

సం/- ఎన్.శ్రీనివాసరావు,
ఉన్నతశ్రేణి కార్యదర్శి,
వ్యవసాయ మార్కెట్ కమిటీ,
ఈమని (ప్ర.కా.) దుగ్గిరాల.





ప్రజాశక్తి
www.prajasakti.com

చిన్న పిల్లలతో గుంటూరులో ధర్నాకు హాజరైన ప్రత్తిపాడుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త

6 నెలల చిన్నారితో నరసరావుపేటలో ధర్నాకు హాజరైన పిడుగురాళ్ల మండలం పిన్నెల్లికి చెందిన అంగన్వాడి టీచర్ వెంకటరమణ





దద్దరిల్లిన కలెక్టరేట్‌లు

- గుంటూరు, పల్నాడులో ముట్టడించిన అంగన్‌వాడీలు
- రెండోరోజూ రెట్టించిన ఉత్సాహంతో ధర్నా
- ఎమ్మెల్సీ లక్ష్మణరావు, వివిధ సంఘాలు పెద్ద ఎత్తున సంఘీభావం
- ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక ఆందోళన : సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36 గంటల ధర్నా రెండో రోజైన మంగళవారం ఉధృతంగా జరిగింది. అంగన్‌వాడీలు రెట్టించిన ఉత్సాహంతో ధర్నాలో పాల్గొన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి తదితరులు ప్రసంగించి, ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌ను ముట్టడించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు రమాసుష్మ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే అదనంగా జీతం ఇస్తానని జగన్ పాదయాత్రలో హామీనిచ్చినా నాలుగేళ్ల పాలనలో అమలు చేయలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. పోరాట ఫలితంగా కర్నాటక ప్రభుత్వం గ్రాట్యుటీ అమలుకు సిద్ధమైందని గుర్తు చేశారు. కనీస పెన్షన్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీల పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ అండగా ఉంటామని ప్రకటించారు. సుబ్బరావమ్మ మాట్లాడుతూ బుధవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే నిరవధిక ఆందోళనకూ దిగుతామన్నారు. ప్రభుత్వ నిర్బంధం, అధికారుల బెదిరింపులను దాటుకొని వేలాదిగా పాల్గొన్న అంగన్‌వాడీలకు అభినందనలు తెలిపారు. నోటీసులకు, బెదిరింపులకు భయపడే ఉద్యమ చరిత్ర అంగన్‌వాడీలకు లేదని, ప్రభుత్వ పీఠాలు కదిలించిన చరిత్ర ఉందని గుర్తుచేసుకోవాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఐసిడిఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రం తెచ్చిన ఎన్ఇపిలోని ప్రీ స్కూల్ విధానాన్ని ఏ రాష్ట్రం అమలు చేయకపోయినా జగన్ ప్రభుత్వం మాత్రం సిద్ధమై, 172 సర్క్యులర్ తెచ్చిందన్నారు. పోరాట ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాల విలీనం నిలిచినా ప్రమాదం పొంచి ఉందని, సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలంటే ఉద్యోగులు కాదంటున్న ప్రభుత్వం, సంక్షేమ పథకాలు అమలుకు మాత్రం ప్రభుత్వ ఉద్యోగులని తిరస్కరిస్తోందని మండిపడ్డారు. అంగన్‌వాడీల్లో వితంతువులు, వికలాంగులు ఉన్న కుటుంబాల్లో కూడా పెన్షన్లు రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వని మానవత్వం లేని ప్రభుత్వం అని మండిపడ్డారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ద్దేశపూర్వకంగా తనిఖీలు చేపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సకాలంలో సరఫరా చేయాలని, నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని, నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్న బిల్లులు సక్రమంగా చెల్లించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఆహార కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డికి హితవు పలికారు. వై.నేతాజి మాట్లాడుతూ పిల్లల్ని ఆడించటం, పాడించాల్సిన అంగన్‌వాడీలకు రకరకాల యాప్‌లు ప్రవేశపెట్టి, వాటిల్లో సమాచారం, ఫొటోలు అప్‌లోడ్ చేయాలని తీవ్రమైన పనిఒత్తిడి పెంచుతున్నారన్నారు. నాలుగేళ్ల క్రితం రూ.వెయ్యి పెంచి గొప్పగా చేశామని చెప్పుకుటున్న ప్రభుత్వానికి వంటగ్యాస్, నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్ ధరలు ఆకాశానికి అంటాయని కనిపించట్లేదా అని ప్రశ్నించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. జిల్లాలో సిడిపిఒల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్ల నుండి ఎదురు చూసి అంగన్‌వాడీలు సహనం కోల్పోయారని, ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు భాగ్యరాజు, లక్ష్మణరావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి..

ధర్నా అనంతరం ధర్నా చౌక్ నుండి ర్యాలీగా వెళ్లి వందలాది మంది అంగన్‌వాడీలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. పోలీసులు గేటుకు ఎదురుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీలు వాటిని నెట్టుకుంటూ లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, అంగన్‌వాడీలు, సిఐటియు నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. పోలీసులు అడ్డుకోవటంతో గేటు ఎదుటే బైటాయించి ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుల్ని అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. ఆందోళన వద్దకు జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై డిఆర్ఒ హామీ ఇవ్వటంతో ముట్టడిని విరమించుకున్నారు.

వెల్లువెత్తిన సంఘీభావం

అంగన్‌వాడీల ధర్నాకు వివిధ ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. ఎల్ఐసి ఉద్యోగులు ధర్నాకు మద్దతు ఇచ్చి రూ.5 వేలు విరాళం ప్రకటించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ముత్యాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్, ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి గాంధీ రామ్మోహనరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం నాయకులు రామకృష్ణ, ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టివిజి రవిశంకర్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు వి.వి.కె.సురేష్, మహిళా కన్వీనర్ ఎం.సుధారాణి, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.సాంబశివరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, వాచ్‌మెన్ల సంఘం నాయకులు నికల్సన్, బిల్డింగ్ వర్కర్ల సంఘం నాయకులు ఖాసింవలి తదితరులు ధర్నాలో పాల్గొని మద్దతు పలికారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు


ధర్నాలో మాట్లాడుతున్న కె.సుబ్బరావమ్మ, మాట్లాడుతున్న నేతాజీ


సిఐటియు నాయకుడ్ని అరెస్ట్ చేసే ప్రయత్నం చేస్తున్న పోలీసులు




అంగన్వాడీల కోలాటం

యాప్‌లు సరిగా పనిచేయవు

ప్రభుత్వం రెండు రకాల యాప్‌లు ప్రవేశపెట్టింది. ఇవి సరిగా పనిచేయవు. అధికారులు అర్ధరాత్రి కూడా మెస్సేజ్‌లు పెట్టి ఐదు నిమిషాల్లో సమాచారం అప్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేస్తారు. అటు యాప్‌లు పనిచేయక, అధికారుల ఒత్తిడితో బిపిలు, షుగర్‌లు తెచ్చుకొని తీవ్రమైన మానసిక వేదన అనుభవిస్తున్నాం. రోజుకో రకంగా యాప్‌ల వర్షన్ మార్చేస్తున్నారు. అవీ సక్రమంగా పనిచేయవు.



ధనలక్ష్మి, ఫిరంగిపురం.

ఆశతో ఎదురు చూస్తున్నాం

తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. నాలుగేళ్లుగా వేతనాలు పెంచుతుందని ఆశతో ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం వచ్చిన కొత్తలో రూ.వెయ్యి పెంచి చేతులు దులిపేసుకుంది. హామీని అమలు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. రాజకీయ వేధింపులు అరికట్టాలి.



ఎం.శ్యామల, గుంటూరు.

ప్రమోషన్లలో రాజకీయ జోక్యం వద్దు

హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలి. రాజకీయ నాయకులు వారి అనుయాయుల్ని నియమించుకోవటానికి ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై వేధింపులకు పాల్పడుతున్నారు. ప్రమోషన్ల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న హెల్పర్లకు వేధింపులు సరికాదు. అర్హులకు పారదర్శకంగా ప్రమోషన్లు కల్పించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి. ఇచ్చే కొద్దిపాటి వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి.



ఎం.బేబీ మధులత, తాడేపల్లి.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) చేపట్టిన 36 గంటల మహాధర్నా విజయవంతమైంది. పగలు ఎండ, ఉక్కపోత.. రాత్రి వర్షం, చలి గాలులున్నా అంగన్వాడీలు ఉక్కు సంకల్పంతో మహా ధర్నాను కొనసాగించి తమ ఐక్యతను చాటారు. ధర్నాకు సిపిఎం, టిడిపి, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. మంగళవారం మధ్యాహ్నం ధర్నా చౌక్ నుండి వేలాది మంది అంగన్వాడీలు భారీ ర్యాలీగా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. వారి నినాదాలతో కలెక్టరేట్ మారుమోగింది. అంగన్వాడీలతో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ మాట్లాడి వినతిపత్రాన్ని స్వీకరించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించదగ్గ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, మిగతా అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ధర్నాకు హాజరైన అంగన్వాడీలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ భోజనాన్ని సమకూర్చగా ఆయనకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పోరాట స్ఫూర్తి కొనసాగించాలి

ధర్నా సందర్భంగా వేదిక వద్ద బహిరంగ సభకు యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి అధ్యక్షత వహించా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడారు. ఐక్యంగా ఉద్యమిస్తే ఎంతటి ప్రభుత్వాలనైనా మెడలువంచి హక్కులు సాధించుకోవచ్చని అన్నారు. మాతా శిశు మరణాల నివారణలో కీలకమైన అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కోతలతో నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీల పోరాటానికి వైసిపి మినహా అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యక్షంగా మద్దతివ్వడం సంతోషకరమని, వైసిపి నేతలూ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెపి మెటిల్డాదేవి, జి.మల్లీశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు 12 ఏళ్లుగా ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదని ఆవేదన వెలిబుచ్చారు. యూనియన్ పోరాటాల ఫలితంగా 2018లో అంగన్వాడీ వర్కర్లకు రూ.1500, హెల్పర్‌కు రూ.750, మినీ వర్కర్లకు రూ.1200 పెంచుతామని ప్రకటించినా అమలు చేయలేదని, 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని, వారి పనిని వారు సక్రమంగా చేసుకునే వెసులుబాటు కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.హనుమంతరెడ్డి, ఎస్.ఆంజనేయనాయక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఐసిడిఎస్‌కు కేంద్ర బడ్జెట్‌లో రూ. 95 వేల కోట్లు కోత విధించారని మండిపడ్డారు.

రాజకీయాలకతీతంగా మద్దతు
ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ చిష్టి

అంగన్వాడీల ఉద్యమానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలపాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ చిష్టి అన్నారు. అంగన్వాడీలు ఏదైనా ఇబ్బంది వల్ల ఒక్కరోజు సెలవు పెట్టాలన్నా నలుగురు వద్ద నుండి అనుమతులు తీసుకోవాల్సిన దుస్థితి ఎందుకని ప్రశ్నించారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుంటే రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అంగన్వాడీల అంశాన్ని ఒక వ్యవస్థకు సంబంధించిన సమస్యగా భవించి పరిష్కారం చూపాలని కోరారు.

పోరాటం స్ఫూర్తిదాయకం
టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు

అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వాలంటీర్లు కూడా అంగన్వాడీలపై పెత్తనం చేస్తున్నారని విమర్శించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తూ ప్రభుత్వ పథకాలను జనాలకు చేరుస్తున్న అంగన్వాడీలకు కనీస వేతనం పెంచాలన్నారు. సమస్యలపై వారు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమని, వారికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వాల నిర్ణయాలు
వై.రాధాకృష్ణ, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి

జిల్లాలో అనేక ప్రాజెక్టులు ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా ప్రమోషన్లు అంగన్వాడీ పోస్టులు భర్తీ చేస్తున్నారని, దీన్ని మానుకోవాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యత్నిస్తోందని, ఇందుకు సంబంధించిన అంశాలు నూతన విద్యా విధానంలో ఉన్నాయని తెలిపారు. ఈ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.


ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జి.మల్లీశ్వరి చిష్టి


అంగన్వాడీల నృత్యం

యాప్ వేధింపులు మానుకోవాలి

ఒకవైపు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పోషణ యాప్ మరోవైపు రాష్ట్రానికి సంబంధించిన వైఎస్సార్ పోషణ యాప్‌ల వల్ల పనిభారం పెరిగింది. సరిహద్దు ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా రావడం లేదు. మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలం తదితర ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. అప్లోడ్ చేయకపోతే చర్యలు తీసుకుంటున్నారు. బాలింతలకు కిట్లు సక్రమంగా ఇవ్వడం లేదు. రాజకీయ నాయకులు వేధింపులు అధికంగా ఉన్నాయి.



ఉషా, మాచర్ల ప్రాజెక్టు.

అమ్మఒడి, జెవికె కిట్లు ఇవ్వాలి

అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు కూడా అమ్మఒడి వర్తింపజేయడంతోపాటు జగనన్న విద్యా కానుక (జెవికె) కిట్లను ఇవ్వాలి. అంగన్వాడీలు మృతి చెందితే ఆ పోస్టు భర్తీకి మృతురాలి కుటుంబంలో ఒకరికి ప్రాధాన్యమివ్వాలి. కనీసం తెలంగాణ కంటే అదనంగా ఇస్తానన్న రూ.వెయ్యి ఇవ్వాలి.



కోటేశ్వరమ్మ, నాదెండ్ల ప్రాజెక్టు.

గౌరవంగా బతకనివ్వండి

ఉద్యోగ విరమణ పొందిన అంగన్వాడీలు గౌరవ ప్రదంగా జీవించేందుకు రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి. 2012 నుండి అంగన్వాడీలకు జీతాలు పెంచలేదు. 2017 నుండి డీఎలు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్రం తెచ్చిన జీవో ఇంతవరకు అమలులో నేర్చుకోలేదు. మినీ వర్కర్లకు వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు అసలు చాలడం లేదు.



లుదియా, నరసరావుపేట.

నూతన విద్యావిధానం వద్దు

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి. ఇది భవిష్యత్ తరాలకు ముప్పు. పిల్లలకు కనీసం సరిపడా పోషకాహార పదార్థాలు పంపిణీ చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు ఇవ్వాలి. రాయితీపై గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం పంపిణీ చేయాలి. గ్రాట్యుటీ అమలు చేసి ఆదుకోవాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. కక్ష సాదింపులు పాల్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



ఉమాదేవి, సత్తెనపల్లి ప్రాజెక్టు.

కూలీల కంటే దారుణంగా వేతనాలు

మాకిచ్చే వేతనాలు ఉపాధి హామీ కూలీల కంటే దారుణంగా ఉంటున్నాయి. అయినా ప్రభుత్వ ఉద్యోగం పేరుతో మాకు సంక్షేమ పథకాలను నిలిపివేయడం అన్యాయం. ఇతర రాష్ట్రాల్లో అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వాలు స్పందిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం మాత్రం అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా ఉంటోంది. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించాలి. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర బడ్జెట్లో నిధులు పెంచాలి.



రజిని, నాదెండ్ల ప్రాజెక్టు.

కబ్జాదారుల చేతుల్లో వేల ఎకరాలు

- ఎమ్మెల్యే సహా అధికార పార్టీ నేతలే ఆక్రమణదారులు
- సమగ్ర విచారణ చేసి ఆ భూములను పేదలకు పంచాలి
- పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్
- భూ ఆక్రమణ వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - వినుకొండ

వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాదారుల చేతుల్లో ఉందని, భూముల ఆక్రమణలో ప్రధానంగా అధికార పార్టీ నేతల ప్రమేయం ఉందని అఖిలపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. వినుకొండ నియోజకవర్గం భూ సమస్యలు, ప్రజల ఇబ్బందులు, ప్రభుత్వ విధానాలపై చర్చా వేదిక సమావేశం మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం గాంధీనగర్లో 450 ఎకరాల ఎస్టీల భూమి అన్యాక్రాంతమైందని, నూజెండ్ల మండలం దాట్లవారిపాలెంలో సుమారు 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని ఆర్ఎంపి వైద్యులు వెంకటేశ్వర్‌రెడ్డి ఆక్రమించి చేపల చెరువు చేశారని, అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూములను అధికార పార్టీ చెందిన వారు అన్యాక్రాంతం చేశారని చెప్పారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సైతం వినకొండలో భూకబ్జాదారుడుగా మారాడని విమర్శించారు. వినుకొండ మండలం వెంకుపాలెం వద్ద పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల భూమిలో ప్రభుత్వ భూమి ఉందని, అంతేకాకుండా ఆ ప్రాంతంలో ఎమ్మెల్యే 170 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని అన్నారు. మార్కాపురం రోడ్డు పసుపులేరు బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే కొనుగోలు చేసిన 100 ఎకరాల్లో 62 ఎకరాల ప్రభుత్వ భూమేనని అన్నారు. ఇటీవల వెలసిన డాలర్ సిటీ అక్రమ వెంచర్లో ప్రభుత్వ భూమిని అప్పనంగా ఆక్రమించారన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి గత ఏడాది డాలర్ సిటీ వెంచర్‌లో ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిలో ఇప్పటివరకు జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేసి స్వాధీనం చేసుకోవాలని చెప్పారని గుర్తు చేశారు. గతంలో అక్కడ అనధికారికంగా వేసిన వెంచర్‌లోని రాళ్లన్నీ ఎమ్మెల్యే తొలగింపజేశారని, ఏడాదిలోపు ఎమ్మెల్యే తన బినామీలతో డాలర్ సిటీని ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. నూజెండ్ల మండలం కంభంపాడు తెల్లపాడు వద్ద రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి బినామీల ద్వారా సుమారు 30 ఎకరాలకు పైగా హస్తగతం చేసుకున్నారని, చెక్క వాగు వద్ద ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నాడని, వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డుతో పాటు వివిధ ప్రాంతాల్లో భూములను చౌకగా కాచేశారని విమర్శించారు. వినుకొండ నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల స్థలాల పేరిట ఏర్పడ్డ జగనన్న కాలనీల భూముల కొనుగోలులో ప్రభుత్వ భూములను ప్రభుత్వానికి అమ్మి అధికార పార్టీ నేతలు కోట్ల రూపాయలు కాజేసారని ఆరోపించారు. చుక్కల భూముల రెగ్యులేషన్ పేరుతో అధికార పార్టీ నాయకులు వందల ఎకరాల భూములకు అక్రమంగా హక్కులు సాధించుకుంటున్నారని అన్నారు. నియోజకవర్గంలో భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తున్న అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ వి.కోటనాయక్, పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, షేక్. మస్తాన్‌వలి, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, బి.కోటయ్య, సిపిఐ నాయకులు బి.శ్రీనివాసరావు, రాము, బిఎస్‌పి నాయకులు రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్.ప్రసన్నకుమార్, ఎంఐఎం నాయకులు షేక్ బాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్కే నాయుడు, ప్రముఖ న్యాయవాది సిహెచ్ఎస్ఎల్ మూర్తి, జనసేన నాయకులు వెంకటేశ్వరరావు, మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసురత్నం పాల్గొన్నారు.


ఐక్యతా అభివాదం చేస్తున్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

భూ ఆక్రమణ వ్యతిరేక పోరాట కమిటీ

వినుకొండ నియోజకవర్గంలో భూ ఆక్రమణలను వ్యతిరేకిస్తూ ప్రభుత్వ భూములను పేదలకు పంచిపెట్టే విధంగా పోరాడేందుకు భూ ఆక్రమణ వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పడింది. వి.కోటనాయక్, షేక్ మస్తాన్‌వలి, ఆర్.ప్రసన్నకుమార్, రాజు, బి.శ్రీనివాసరావు, మూర్తి, షేక్ బాజీ, ఆర్కే. నాయుడు, వెంకటేశ్వరరావు ఉన్నారు.


ప్రదర్శనలో జీవీ ఆంజనేయులు, టిడిపి శ్రేణులు

యువగళానికి సంఘీభావం

ప్రజాశక్తి - వినుకొండ : వైసిపి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా మంగవారం వినుకొండలో మార్కాపురం రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద నుండి సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై జీవీ ఆంజనేయులు తీవ్ర విమర్శలు చేశారు. టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు పఠాన్ అయుబ్ ఖాన్, జి.సాంబశివరావు, నాయకులు షమీంఖాన్ ఎం.శివప్రసాదరావు, ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు.

14న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - మాచర్ల : స్థానిక పోస్టాఫీస్ వెనుక గల శ్రీ వాసవి వృద్ధాశ్రమంలో 14న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి ఓరుగంటి చెన్నకేశవరావు, పందిరి నరసింహారావు, ముప్పవరపు నాగార్జున మంగళవారం తెలిపారు. శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కంటి విభాగం సహకారంతో నిర్వహించే శిబిరంలో కంటికి చెందిన అన్ని పరీక్షలు, ఆపరేషన్లు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఆపరేషన్ చేయాల్సి వస్తే వారిని బస్సులో తీసుకెళ్లి అపరేషన్ నిర్వహించిన తదనంతరం తిరిగి బస్సులో మాచర్లకు ఉచితంగా తీసుకొస్తారని తెలిపారు. ఆదనపు వివరాల కొరకు 9553482254, 8074946674 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.



కుటుంబ నియంత్రణ పాటించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తూ మేమిద్దరం మాకు ఇద్దరు అనే భావంతో దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీలక్ష్మి కవిత ఆధ్వర్యంలో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. 25వ తేదీ వరకు జరుగుతున్న 'జనాభా స్థిరీకరణ పక్షోత్సవం' లక్ష్యాన్ని ఆశా, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ః ఆరోగ్య విస్తరణ అధికారులు పి.వెంకటరావు, మహమ్మద్ ఖదీర్, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, సంపూర్ణ, వరలక్ష్మి, మార్గరెట్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రమైన ముప్పాళ్ల పిహెచ్‌సి, మండల పరిధిలోని మాదల, నార్నెపాడు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. 62 మంది గర్భిణులకు ల్యాబ్ టెస్టింగ్, ఇతర పరీక్షలు నిర్వహించారు. మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ పి.రమాదేవి, డాక్టర్ జయకృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు పీటర్ డేమియాన్, నాగమల్లేశ్వరరావు, జోస్పిన్ రాణి, సిహెచ్‌ఓ తేజ, కరిముల్లా, మస్తాన్‌రావు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భూసారం ఆధారంగా ఎరువుల వినియోగం

ప్రజాశక్తి-ఈపూరు

రైతులంతా భూసార పరీక్షల చేయించుకుని ఆ ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని రైతులకు జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ బివి శివకుమారి సూచించారు. పంటల సాగుపై మండల కేంద్రమైన ఈపూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. శివకుమారి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట, జీలుగా, జనుము, పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని సాగు చేస్తే భూసారం పెరుగుతుందని చెప్పారు. విత్తన శుద్ధి ప్రక్రియ ద్వారా పురుగుల ఉధృతిని తగ్గించవచ్చున్నారు. వరి పండించే రైతులు విత్తనాలను సూడోమోనాస్ 10 గ్రాములు కిలో విత్తనానికి లేదా కార్బ న్డిజం 2.5 గ్రాములు కిలో విత్తనానికి వాడాలని సూచించారు. మిరప పండించే రైతులు దుక్కిలో రెండు క్వింటాళ్ల వేప పిండి లేదా జీవ శిలీంద్ర నాసిని అయిన ట్రైకోడెర్మా విరిడి కల్చర్ను వాడాలన్నారు. బాపట్ల వరి పరిశోధన కేంద్రంలో బిపిటి 2782 వరి కొత్త రకం అందుబాటులో ఉందని ఈ రకం పంటకాలం 145-150 రోజులని బ్యాక్టీరియ, ఎండు తెగులును, అగ్గి తెగులును తట్టుకుంటుందని వివరించారు. పప్పు జాతి పంటలైన పెసర రకాలు ఎల్‌జిజి 630, ఎల్‌జిజి 574 లాంఫారంలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు పంట యాజమాన్యం పట్ల సందేహాలు ఉంటే రైతు సమాచార కేంద్రం - 155251ను సంప్రదించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి రామారావు మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని, పొలం గట్లపై నాటేందుకు కందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని తెలిపారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అప్పారావు, వ్యవసాయ సహాయకులు ఎం.శేషుబాబు పాల్గొన్నారు.


పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ఎడిఎ శివకుమారి

31 సచివాలయాల్లో జగనన్న సురక్ష పూర్తి

ప్రజాశక్తి - మాచర్ల : అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించటమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళశారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఇంట ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించటమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాచర్ల నియోజకవర్గంలోని 81 సచివాలయాలకు గాను 31 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించామన్నారు.

కెజిబివి ప్రిన్సిపాల్‌గా రాజకుమారి

ప్రజాశక్తి-రెంటచింతల : మండలంలోని మిట్టగుడిపాడులోని కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా బాలినేని రాజకుమారి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇదే ఆమెకు తొలి పోస్టింగ్ కావడం గమనార్హం.

డెంగీ అనుమానిత కేసుపై పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : డెంగీ అనుమానిత కేసు నమోదు నేపథ్యంలో మండలంలోని గర్నెపూడిని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ మంగళవారం సందర్శించారు. ఇంటింటికి జరుగుతున్న 51వ విడత జ్వరాల సర్వే, లార్వా సర్వే, పిడిపి వర్క్‌ను పరిశీలించారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల వినతి

ప్రజాశక్తి - క్రోసూరు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారికి సంక్షేమ బోర్డు ద్వారా అమలవ్వాల్సిన పథకాలపై అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో చర్చించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. తొలుత స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ నుండి కార్యాలయం వరకు కార్మికులు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎ.ప్రసాదరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు 15 ఏళ్లపాటు ఉద్యమించి 1996లో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని సాధించుకున్నారని, దాని అమలు కోసం మరో 13 ఏళ్లు పోరాడారని, 2009లో రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన చట్టాన్ని ప్రస్తుత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 1214 మెమో జారీ ద్వారా సంక్షేమ పథకాలను నిలిపేశారని అన్నారు. రాష్ట్రంలో 35 లక్షల మంది భవనిర్మాణ కార్మికులు, పెదకూరపాడు నియోజకవర్గంలో 12 వేల మంది ఉన్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ఏం చేస్తోందో చెప్పాలని ప్రశ్నించారు. సంక్షేమ బోర్డు నుండి రూ.8 కోట్ల పథకాలు నిలిచాయని తెలిపారు. కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డులోని దాదాపు రూ.1400 కోట్ల గాను గత ప్రభుత్వం చంద్రన్న బీమా పేరుతో ఊ.400 కోట్లు తీసుకుంటే ప్రస్తుత ప్రభుత్వం మిగతా మొత్తాన్ని దారిమళ్లించిందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన క్లెయిమును సత్వరమే అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, సిహెచ్.యేషియ్య, కె.మల్లికార్జునరావు, బి.కొండలరావు, వెంకటేశ్వర్లు, సోమయ్య, నాగేశ్వరరావు, మీరయ్య, సురేంద్ర నాగమల్లి, బాలకృష్ణ పాల్గొన్నారు.



ప్రదర్శనగా వెళ్తున్న కార్మికులు

పెరిగిన పసుపు ధరలు

యార్డులో 1546 క్వింటాళ్ల విక్రయాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో మంగళవారం పసుపు ధరలు అకస్మాత్తుగా క్వింటాలుకు రూ. 750 పెరిగాయి. ఇదే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా రూ.550 అధికం దీనితో రైతులు ఒక్కరోజు లోనే 1536 కింటాళ్ళు అమ్మకాలు జరిపారు. పసుపుకొమ్ములు కనిష్ట ధర క్వింటాళ్‌కు రూ.6 401 గరిష్ట ధర 7400, సగటు ధర రూ. 7వేలు, దుంపలు గరిష్ట ధర రూ.6950, సగటుధర రూ.69 50 పలికాయని పలికినవి యార్డ్ చైర్మన్ షేక్ బాజీ తెలిపారు.

24వ తేదీ నుండి యార్డులో మధ్యాహ్న భోజనం

ఈనెల 24వ తేదీ సోమవారం నుండి యార్డులో పసుపు అమ్మిన రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించనున్నట్లు యాడ్ సెలెక్షన్ గ్రేట్ సెక్రటరీ ఎన్ శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఈ పథకం అమలులో ఉన్నప్పటికీ కరోనాకాలంలో లాక్ డౌన్ వలన నిలిపివేశారు. తిరిగి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.



ఆటో డ్రైవర్లుకు సిఐ అదేశాలు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లకు మేడికొండూరు పోలీస్ స్టేషన్లో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో సిఐ వాసు మాట్లాడుతు ప్రతి ఒక్క ఆటో ఓనర్, తమ ఆటోలకు సంబంధించిన కాగితాలు, లైసెన్సులు పోలీస్ స్టేషన్లో సమర్పించాలని తెలిపారు. ప్రతి ఆటోకు సీరియల్ నెంబర్ స్టిక్కరింగ్ ఉంటుందని అన్నారు. ప్రతి ఆటోకు విధిగా రిజిస్ట్రేషన్ నెంబర్లు కనిపించే విధంగా నెంబర్ ప్లేట్లు అమర్చాలని తెలిపారు. మండల పరిధిలోని నేరాలను అదుపు చేయడానికి ఈ విధానాన్ని అమలులోకి తీస్తున్నట్లు తెలిపారు.

రాజధానిలో రోడ్ల దుస్థితి అధ్వానం

కురగల్లులో డ్రెయినేజీని తలపిస్తున్న ప్రధాన రహదారి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని గ్రామాల్లో రోడ్ల దుస్థితి అధ్వానంగా తయారయింది. చిన్నపాటి వర్షానికి ప్రధాన రహదారుల సైతం డ్రైనేజీలను తలపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు తూతూ మంత్రపు చర్యలతో కాలం వెల్లదీస్తున్నారు. మండలంలోని రాజధాని గ్రామమైన కురగల్లు గ్రామ ప్రధాన రహదారి రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీని తలపిస్తుంది. రహదారిపై గుంతలు ఏర్పడి ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతూ







వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తు తున్నాయి. ప్రైవేట్ యూనివర్సిటీ బస్సులు సైతం వెళ్లేందుకు ఆటంకం ఏర్పడుతుంది. స్థానికులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఈ సమస్య తలెత్తుతున్న అధికారులు మాత్రం వర్షాకాల సమయంలో గుంతలను చిప్స్‌తో పూడ్చి నామమాత్రపు చర్యలు చేపడుతున్నారు. సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టడం లేదని పేర్కొంటున్నారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని వారు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా శాశ్వత చర్యలు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆస్పత్రికి చెడ్డ పేరు తీసుకురావద్దు

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి లోని వివిధ ఓపి విభాగం లో నిరూపయోగంగా ఉన్న వస్తువులను వెంటనే వర్క్ షాపుకు తరలించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రి లోని ఓ పి లను ఆయన తనిఖీ లు చేశారు. స్త్రీల వ్యాధుల, కాన్పుల విభాగంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ రూమ్, డాప్లర్ స్కాన్ గదులను ఆయన పరిశీలించారు. ఈ విభాగంలో నిరూపయోగంగా ఉన్న ట్రేసైకిళ్లు ఎందుకు ఉంచారంటు ఆయన సిబ్బంది ని ప్రశ్నించారు. ఇలాంటి వస్తువులను వెంటనే తొలగించాలని అయన ఆదేశించారు. పనికి రాని వస్తువులు గదుల్లో ఉండటం వల్ల ఎలుకలు దూరి అపరిశుభ్ర వాతావరణాన్ని సృష్టిస్తాయని ఆయన అన్నారు. గతంలో ఎలుకల బారిన పడి ఒక చిన్నారి చనిపోయిన సంగతి మర్చిపోవద్దని ఆయన గుర్తు చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆసుపత్రికి చెడ్డ పేరు వస్తుందని ఆయన హెచ్చరించారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఓ పి లో రోగులకు సకాలం లో హెచ్ ఐ వి పరీక్షలు చేసి పంపించాలన్నారు. హెచ్ ఐ వి బాధితులకు వ్యాధి పై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన టి వి ఉపయోగకరంగా లేకపోవడంతో మరమ్మతులు చేయాలని ఆయన ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని ఆయన సూచించారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ యం ఓ. డాక్టర్ సతీష్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి ఎస్ ఎస్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.



నాడు-నేడు పనులను పరిశీలించిన మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఆర్.అగ్రహారంలోని కావటి శంకరరావు మున్సిపల్ హైస్కూల్‌లో రూ.1.39 కోట్లతో నాడు-నేడు పథకం కింద చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ఉండాలనే ధ్యేయంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నారన్నారు. తరగతి గదుల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఇంజినీరింగ్



అధికారులు ఎప్పటికప్పుడు పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుండా లని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతిపద్మజ తదితరులు పాల్గొన్నారు.



పారదర్శకంగా రైతులకు సేవలు

ప్రజాశక్తి - చేబ్రోలు

పారదర్శకంగా రైతులకు సొసైటీ సేవలు అందజేస్తామని అధ్యక్షులు చందు సాంబశివరావు తెలిపారు. మంగళవారం జిడిసిసి బ్యాంకు చేబ్రోలు పరిధిలోని రైతులకు నగదు డిపాజిట్, గోల్డ్, ఎడ్యుకేషన్, ఇళ్లు, గిడ్డంగులపైలోన్స్ పై అవగాహన సమావేశం వేజెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో నిర్వహించారు. చందు సాంబశివరావు అధ్యక్షతన కార్యక్రమంలో జిడిసిసి బ్యాంకు మేనేజర్ సయ్యద్‌జానీ మాట్లాడుతు వేజెండ్ల సొసైటీ ద్వారా రైతులకు ఈ క్రాప్ తదితర లోన్లు ఇస్తామన్నారు. లాంగ్ టర్మ్ లోన్స్ ద్వారా రైతులు గొర్రెలు, గేదెలు, ట్రాక్టర్లు డైరీ ఫార్మ్ లాంటి అభివృద్ధి పనులకు తక్కువ వడ్డీతో ఇచ్చే లోన్లు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఆగస్టు నుంచి వేజెండ్ల సొసైటీ ద్వారా రైతులుకు ఎరువులు,ఫెర్టిలై జెర్స్, పెస్టిసైడ్స్, విత్తనాలు సొసైటీ ద్వారా అందించాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు చందు సాంబశివరావు అన్నారు. రైతుల నుండి లోన్ అమౌంట్ ఆరు నెలలు మరియు వార్షిక పద్ధతిలో రికవరీ ఉంటుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా గతంలో 40 సెంట్లు లేదా ఆపైన భూమి ఉన్న రైతులకు మాత్రమే లోనులు ఇవ్వడం జరుగుతూ ఉండేదని ప్రస్తుతం 25 సెంట్లు భూమి ఉన్న రైతులు కూడా సొసైటీ ద్వారా లోను ఇచ్చేందుకు సౌకర్యం కల్పించబడిందని తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఎస్ కె మహబూబ్ భాషా, బ్యాంక్ సూపర్వైజర్ శివన్నారాయణ, సొసైటీ డైరెక్టర్ ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో హెల్త్ హాస్పిటల్స్ ఉచిత సేవలు

ప్రజాశక్తి- తెనాలి

స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యశాల హెల్త్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల కోసం ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి వర్గాలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. డిపో మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ వైద్య శిబిరం ఆవశ్యకతను ఎమ్మెల్యే దష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించి హెల్త్ హాస్పిటల్ ద్వారా శిబిరం నిర్వహించినందుకు కతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో కంటి వైద్య పరీక్షలు, షుగర్ ,బిపి, ఈసిజి వంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

16న శ్రీచక్ర హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- తెనాలి

ఈనెల 16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్థానిక బోస్ రోడ్డు లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం సత్రం ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భాస్కరుని శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ మద్దాలి శేషాచలం మంగళవారం తెలిపారు. శిబిరంలో పట్టణంలోని ప్రముఖ శ్రీ చక్ర సూపర్ స్పెషాలిటీ వైద్యశాల బృందం వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు. ముందుగా కూపన్లు తీసుకున్నావారు మాత్రమే శిబిరంలో వైద్య సేవలు పొందేందుకు అర్హులని తెలిపారు. కూపన్లు కావలసినవారు గంగానమ్మపేట ఐసిఐసిఐ బ్యాంకు ఎదురుగా ఉన్న రూప శ్రీ చందన ట్రేడర్స్‌లో సంప్రదించాలన్నారు.

ప్రకృతి వనరుల్ని రక్షించుకోవాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రకృతి వనరులను సంరక్షించుకోవాలని ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పెదనందిపాడు శాఖ గ్రంథాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి సుభాషిని, నూకబత్తిన వంశి, గేరా మంజుల, ఏ సురేష్ పాల్గొన్నారు.

సబ్సిడీ టమాటాల విక్రయం ఒక్క రోజే !

రైతు బజారులో అధికారుల తీరుపై వినియోగదారుల ఆగ్రహం

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి మార్కెట్ యార్డ్ ఆవరణలోని రైతు బజార్లో కిలో రూ. 50ల చొప్పున టమాటాలను ఒక్కరోజే విక్రయించడం పట్ల వినియోగ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో టమాటా కిలో రూ.120 నుంచి 150 వరకు ఉంది. అయితే రైతు బజార్లో ప్రభుత్వం సబ్సిడీపై కిలో రూ.50కే అందజేస్తుంది. విజయవాడ, గుంటూరు నగరాలలోని రైతు బజారులో టమాట కిలో రూ. 50 చొప్పున రోజూ వినియోగదారులకు అందిస్తున్నప్పటికీ మంగళగిరి రైతు బజార్‌లో సబ్సిడీ టమాటాలు రోజూ విక్రయించడంలేదు. అధికారులకు మంగళగిరి రైతు బజారుపై ఎందుకింత శీతకన్ను అంటూ వినియోగదారులు ఒకంత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల సమస్యను రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ గుంటూరు రమేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందిస్తూ సబ్సిడీ టమాటలు ఈనెల 5వ తేదీన మాత్రమే వచ్చాయని, మళ్లీ టమాటా దిగుమతి కోసం అసిస్టెంట్ డైరెక్టర్ మార్కెటింగ్ వారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. రైతు బజార్‌కు టమాటాలు పంపించడానికి చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చెప్పారన్నారు.

చేతిపంపు ఏర్పాటు చేయండి సారూ..

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ :పొన్నూరు పట్టణం మూడో వార్డు హిందూ స్మశాన వాటిక బజారులో చేతి పంపు లేక ప్రజలు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో చేతి పంపు మరమ్మతులు చేసిన మున్సిపల్ సిబ్బంది పంపులు కూడా తీసుకెళ్లి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 20 గృహాల ప్రజలకు నీటి అవసరాలకు మున్సిపల్ చేతి పంపు మీద ఆధారపడే వాళ్ళమని, పంపు లేకపోతే నిత్యవసర పనులకు తీవ్ర ఇబ్బందిగా ఉందని తెలిపారు. చేతి పంపు నిర్మించమని పలుమార్లు వార్డు సచివాలయ అధికారులకు తెలియపరిచిన స్పందించలేదన్నారు. మున్సిపల్ అధికారులు చేతి పంపును తక్షణం ఏర్పాటు చేయాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.



నాగులపాడు ఆర్.బి.కె అధికారికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ :రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నాగులపాడు రైతు భరోసా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేసి, అధికారి జ్యోత్స్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు మాట్లాడుతూ 2022 ఖరీఫ్, రబీ సీజన్లో అకాల వర్షాలు వల్ల పెద్ద ఎత్తున పత్తి, మిరప, శనగ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని, ఇన్ ఫుట్ సబ్సిడీ, పంటల బీమా పథకాలు రైతులకి సరిగా అందలేదని తెలిపారు. వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి వీటికి రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కాపు వెంకట సుబ్బారావు, చుక్కా యానాదులు, రైతులు పాటిబండ్ల నాగరాజు, బండి గోవిందు, కొమ్మలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి :రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సందర్భంగా రైతు సంఘం నాయకులు వై వెంకటేశ్వరరావు, ఎం సుహాన్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ గా వినతిపత్రం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, వివిధ సంఘాల నాయకులు పి జానీ, జి స్వామి రెడ్డి పాల్గొన్నారు.

విఆర్ఎ పై దాడి చేసిన పెత్తందార్లపై చర్యలు తీసుకోవాలి

రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.భాస్కరయ్య - బాధితునికి పరామర్శ

ప్రజాశక్తి-తాడేపల్లి



పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో విఆర్ఎ వి.శ్రీనివాసరావుపై దాడి చేసిన పెత్తందారు కుర్ర వేణు, వారి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.భాస్కరయ్య డిమాండ్ చేశారు. శ్రీనివాస రావుకు చెందిన గేదె అగ్రవర్ణ కుటుంబం లోని ఒకరికి తగిలిందనే నెపంతో దాడి చేయడం దుర్మార్గమన్నారు. అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా మారణాయుధాలతో ఇంటి మీదకు రావడం క్షమించరాని విషయమన్నారు. పల్నాడు ఎస్‌పి వెంటనే స్పందించి శ్రీనివాసరావుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులను పరామర్శించిన వారిలో గుంటూరు జిల్లా కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి ఉన్నారు.



అసిస్టెంట్ ప్రొఫెసర్లు బిందునర్మద, కాంతిమలతో న్యూరో విభాగం అధిపతి ప్రొఫెసర్ సుందరాచారి

న్యూరాలజి వైద్యులకు అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి న్యూరాలజి విభాగం సత్తా చాటింది. ఈ నెల ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు కర్నూలులో జరిగిన స్టేట్ న్యూరాలజీ న్యూరోసర్జరీ కాన్ఫరెన్స్‌లో తలలో వత్తిడి పెరిగి కంటి నరం దెబ్బ తినడం.. కంటి చూపు కోల్పోవడంపై పరిశోధనకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మదకు కాంట్రిబ్యూటర్ అవార్డ్ లభించింది. ఈ అవార్డు కింద రూ.50 వేల నగదు తో పాటు ప్రశంసా పత్రం ఆమె అందుకున్నారు. అదే విదంగా డాక్టర్ కాంతిమకు కూడా పోస్టర్ అవార్డు అందుకున్నారు. అవార్డులను అందుకున్న ఇరువురిని ఆ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ సుందరాచారీ, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అభినందించారు.

నాగార్జున కొండను సందర్శించిన అమెరికా ప్రొఫెసర్

ప్రజాశక్తి - విజయపురిసౌత్



ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను అమెరికా లోని హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ ఎంగిడే మంగళవారం సందర్శించారు. ఏపీ కల్చరల్ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జున రావుతో కలిసి నాగసిరి లాంచీలో నాగార్జున కొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియం లోని బుద్ధుని చరిత్ర, పాలరాతి విగ్రహలను, శిల్పాలను, ప్రధాన స్థూపాలతో పాటు పురాతన ఆనవాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నాగార్జున కొండ ప్రత్యేకత, చారిత్రక అంశాలను మ్యూజియం క్యూరేటర్ కమల్ హాసన్ వారికి వివరించారు. భారత దేశంలోని బౌద్ధ విశిష్టత గురించి అధ్యయనం చేసేందుకు నాగార్జున కొండను సందర్శించినట్లు ప్రొఫెసర్ సూరజ్ ఎంగిడే తెలిపారు. ఆయన వెంట హరిత రిసార్ట్ మేనేజర్ శ్రీనివాస్, లాంచీ స్టేషన్ మేనేజర్ వినయతుల్లా, పురావస్తు శాఖ సీపే వెంకటయ్య ఉన్నారు.

రాజకీయాలపై పవన్‌కు శిక్షణ అవసరం

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :సినిమాల నుంచి రాజకీయాలల్లోకి వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు రాజకీయ శిక్షణ ఎంతో అవసరం ఉందనిజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆమె మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఉన్న బలమైన వివాహ వ్యవస్థను దిగజార్చి మూడు వివాహాలు చేసుకున్న పవన్ కల్యాణ్‌కు ఇప్పటికీ మహిళలపై తగిన గౌరవం లేదని విమర్శించారు. రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థపై చేసిన విమర్శలు పవన్ కల్యాణ్ రాజకీయ దిగజారుడుకి నిదర్శనం అన్నారు. మహిళల ఆచూకిలేకుండా పోవడానికి, వాలంటీర్లకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. వాలంటీర్లలో 70 శాతం మహిళలే ఉన్న విషయం పవన్ గ్రహించాలన్నారు.వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని అంతేతప్ప ప్రజలను ఇబ్బంది పెట్టే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదన్నారు. కరోనా కష్టకాలంలో వాలంటీర్ల సేవలను ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయన్నారు. పవన్ కళ్యాణ్ మహిళలను కించపరుస్తూ చేసిన ఆరోపణలను దమ్ము ధైర్యం ఉంటే నిరూపించాలన్నారు. పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. చంద్రబాబుకు రాసి ఇచ్చిన స్క్రిప్టు చదవడం తప్ప పవన్ కల్యాణ్‌కు ప్రజా సమస్యలపై అవగాహన లేదన్నారు.

లింగ సమానత్వం, స్త్రీ సాధికారతే లక్ష్యం

ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

జనాభా పెరుగుదలతో ఎదురయ్యే సవాళ్ల, సమస్యలు, పర్యవసానాలపై అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది 'ప్రపంచ జనాభా దినోత్సవాన్ని' జరుపుకుంటున్నా మని జిల్లా కలెక్టర్ శివ శంకర్ అన్నారు. ఈ ఏడాది లింగ సమానత్వంపై దృష్టి సారించడం ద్వారా మహిళా సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోజు రోజుకీ పెరుగుతున్న ప్రపంచ జనాభాతో ఆర్థిక సంక్షోభం, పేదరికం పెను సవాలుగా మారుతోందన్నారు. 1990 లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం 45/216 ద్వారా 'ప్రపంచ జనాభా దినోత్సవం' జరపాలని నిర్ణయించిందన్నారు. పెరుగుతున్న జనాభా, పర్యావరణం, అభివృద్ధి వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించ డమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. 2022 నాటికి ప్రపంచ జనాభా 8 బిలియన్లకు చేరిందన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు శ్రామికులుగా మారుతున్నారన్నారు. ప్రతి రెండు నిముషాలకు ప్రసవసమయం కాని, హింస కారణంగా కానీ ఒక మహిళ మరణిస్తోం దన్నారు. జనాభా సమస్యలో కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, బాల్య వివాహం, మానవ హక్కులు, ఆరోగ్య హక్కు, శిశువు ఆరోగ్యం మొదలైనవి ఉంటాయని తెలిపారు. అందువలన ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వీటిపై దృష్టి పెడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె పద్మావతి, డాక్టర్ బి గీతాంజలి నీలకంఠేశ్వ రరావు, కె సాంబశివరావు, డిప్యూటీ డెమో, రవీంద్ర రత్నాకర్ డిఎంఒ, ఎస్.కె ఖాజావలి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా లక్ష్యం

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించటం లక్ష్యంగా బిఎల్ఓలు విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ బిఎల్ఓలు, సూపర్వైజర్లకు, అధికారులకు స్పెషల్ సమ్మరి రివిజన్-2024లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరి రివిజన్ చేపడుతుందని, అందులో భాగంగా ఈ నెల 21 నుండి ఆగస్ట్ 21 వరకు జిల్లాలో స్పెషల్ క్యాంపెయిన్ జరుగుతుందన్నారు. స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా బిఎల్ఓలు ప్రతి ఇంటిని ప్రత్యక్షంగా పరిశీలించి ఓటర్లకు సంబందించి సమగ్ర రిపోర్ట్ సేకరించాలని ఆదేశించారు. డోర్ నంబర్, ఓటర్ పేరు, వయస్సు, జెండర్, వలస వెళ్ళిన వారి వివరాలు, చనిపోయిన వారి వివరాలు తగిన ఫారంలో నమోదు చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్ళ నిండి ఓటు అర్హత ఉన్న వారిచే నూతన ఓటు దరఖాస్తులు చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ క్యాంపెయిన్‌లో బిఎల్ఓల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నగర ప్రజలు కూడా తమ ఇళ్ళ వద్దకు వచ్చే బిఎల్ఓలకు ఓటర్లకు సంబందించిన సమగ్ర వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు, అదనపు కమిషనర్ పెద్ది రోజా, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లక్ష్మణరావు దంపతులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యశ్వంత్, సాయి, శ్రీనివాస్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న లక్ష్మణరావు, విజయకుమారి దంపతులు

నిబంధనల ప్రకారం భవనాలు నిర్మించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



భవనం కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్

నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణం చేయాలని, నిబందనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ ఏటి అగ్రహారం, బందావన్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాల నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్‌టిపిలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్ లైన్ ద్వారా డిపిఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. మాస్టర్ ప్లాన్ ఎలైన్మెంట్ కానీ, మాస్టర్ ప్లాన్‌లో చేసిన భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ అనుమతులు ఇవ్వబడవన్నారు. సెట్‌బ్యాక్ పోర్షన్‌లో, రోడ్డు విస్తరణ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా ఆక్యుపెన్సీ ఇవ్వటం జరగదని స్పష్టం చేశారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరికి కేటాయింపు ఉండాలన్నారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పనిచేసేలా కనెక్షన్ చేయాలన్నారు. ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబందించిన నిబందనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కల్గి ఉండాలన్నారు.పర్యటనలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, టిపిఎస్ లక్ష్మణస్వామి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.